సాక్షి
వికారాబాద్

గురువారం । 26 । జూన్ । 2025



చిన్నారిని చిదిమేసిన లారీ

అతివేగంగా ప్రయాణిస్తున్న లారీ అదుపు తప్పి స్కూటీని ఢీ కొట్టడంతో ఓ చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. 8లో▸



దాడి చేసిన వారిపై..

హాజీపూర్‌కు చెందిన దళిత రైతు రవికుమార్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కేవీపీఎస్ నేతలు కోరారు. 8లో▸



రైతు నేస్తం..

వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

కిలోన్నర గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు రఫీక్

తాండూరు టౌన్: గంజాయి విక్రయిస్తున్నాడన్న పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన తాండూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన రఫీక్ అనే వ్యక్తి కొంత కాలంగా కర్ణాటక రాష్ట్రం నుంచి గంజాయి తెచ్చి పలువురికి విక్రయిస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో బుధవారం స్థానిక విలియంమూన్ గ్రౌండ్ సమీపంలో స్థానిక పోలీసులతో కలిసి రఫీక్‌ను పట్టుకున్నారు. అతని వద్ద నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎమర్జెన్సీ.. స్వేచ్ఛకు చీకటి దినం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్



ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన వారిని సన్మానించిన బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించడం స్వేచ్ఛా, స్వాతంత్య్రాలకు చీకటి దినమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్ అన్నారు. బుధవారం పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ సమయంలో జైలు జీవితం గడిపిన పలువురిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఆనాటి చీకటి దినాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం రమేష్ కుమార్ మాట్లాడుతూ.. జాతీయ అత్యవసర పరిస్థితి విధించి, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి.. అనేక మందిని అకారణంగా జైల్లో పెట్టిందన్నారు. అప్పటి చీకటి రోజులు తిరిగి రాకూడదని, రాజ్యాంగం అమలు పకడ్బందీగా జరగాలని కోరుతున్నట్లు చెప్పారు. ఎమర్జెన్సీ సందర్భంగా జైలుకు వెళ్లిన ప్యాట నారాయణరెడ్డి, కె.నర్సిరెడ్డి, జి.ప్రభులింగం, ఆలంపల్లి రాంరెడ్డి, ఖాంజాపూర్ రాంరెడ్డి, దోర్నాల అనంతరెడ్డి తదితరులను ఘనంగా సన్మానించామన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ ముదిరాజ్, శాంత్‌కుమార్, లలిత, భద్రేశ్వర్, చంద్రశేఖర్, గౌరీ శంకర్, పటేల్ విజయ్, సుదర్శన్ గౌడ్, జగదీష్ యాదవ్, దోమ కృష్ణ, ప్రకాష్, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్, బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు రెండో విడత కౌన్సెలింగ్

అనంతగిరి: డీసెట్ – 2025 ధ్రువపత్రాల పరిశీలనకు మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు రెండో విడత ధ్రువపత్రాల పరిశీలన జూన్ 27న నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కాగా వెబ్ కౌన్సెలింగ్ 28 నుంచి 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9441071533లో సంప్రదించాలన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

ఏడీఏ పద్మావతి




ఫెర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ పద్మావతి

యాచారం: విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో రైతులను మోసం చేస్తే జైలు శిక్ష తప్పదని జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏ పద్మావతి హెచ్చరించారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని పలు విత్తనాలు, ఎరువులు విక్రయించే దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఏ ధరకు విత్తనా లు, ఎరువులు అమ్ముతున్నారు, ధరలు ఎలా ఉన్నా యి, రైతులకు రసీదులు ఇస్తున్నారా.? కాలం చెల్లిన విత్తనాలను, ఎరువులను రైతులకు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాపారులు అధిక లాభార్జన ఆశతో రైతులను మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోళ్లపై రైతులకు వెంటనే రసీదులు ఇవ్వాలని సూచించారు. స్టాక్‌బోర్డులు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు.

కానరాని కారు నేతలు

ప్రజాక్షేత్రం వీడిన బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు

- నియోజకవర్గాలకు దూరంగా..
- పల్లెలు వదిలి పట్నంలో పాగా..
- ప్రజా సమస్యలను పట్టించుకోని వైనం
- పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలకు దూరంగానే..
- అయోమయంలో కేడర్



వికారాబాద్: ప్రజల్లో ఉంటూ వారి సమస్యలపై ప్రభుత్వంతో పోరాడాల్సిన ప్రతిపక్ష పార్టీ నేతలు అస్త్రసన్యాసం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రజాక్షేత్రం వీడి పట్టణాల్లో గడుపుతున్నారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో నిత్యం హంగు ఆర్భాటాలతో గడిపిన బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఓటమి పాలవగానే నియోజకవర్గాలకు దూరమయ్యారు.రాష్ట్ర రాజధానిలో ఉంటూ చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని నలుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఓటమిపాలవగా ఆ స్థానాలను కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకున్న విషయం తెలిసిందే. అధికారం చేపట్టింది మొదలు హస్తం నేతలు నిత్యం ప్రజల్లో ఉంటూ దూసుకుపోతుండగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు అండగా నిలవాల్సిన బీఆర్‌ఎస్ నేతలు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. నలుగురిలో ఒకరు తరచూ విదేశీ పర్యటనల్లో బిజీగా ఉన్నారు.మరో ఇద్దరు రాష్ట్ర రాజధానిలో మకాం వేశారు.పార్టీ జిల్లా సారథి స్థానికంగానే ఉంటున్నా ప్రజాక్షేత్రంలో కనిపించడంలేదు. దీంతో ద్వితీయ శ్రేణి నాయకులు అయోమయంలో పడ్డారు. తమపై అధికార పార్టీ నేతలు అక్రమ కేసులు పెట్టిస్తున్నా నేతలు పట్టించుకోవడం లేదని ఆవేదనతో రగిలిపోతున్నారు. ఈ విషయమై కొందరు పార్టీ సీనియర్ నాయకులు అధిష్టానం దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు సమాచారం.

విదేశాల్లో పైలెట్

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఎక్కువగా హల్‌చల్ చేసింది తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అనేది అందరికీ తెలిసిన విషయమే.. ఆయన ఓటమి పాలయ్యాక నియోజకవర్గానికి పూర్తిగా దూరమయ్యారు. విదేశీ పర్యటనల్లో ఉంటూ సొంత వ్యాపారాలు చూసుకుంటున్నట్లు సమాచారం. రెండు మూడు నెలలకు ఒక్కసారి కూడా తాండూరుకు రావడంలేదు. ఒక పక్క అధికార పార్టీకి చెందిన ఇద్దరు నేతలు పోటాపోటీగా నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారు. మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి దూసుకుపోతుంటే.. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నియోజకవర్గంలో తిష్టవేసి ప్రజలకు అందుబాటులో ఉన్నారు. రోహిత్‌రెడ్డి తండ్రి అప్పుడప్పుడు కార్యకర్తలను కలుస్తున్నా పైలెట్ లేని లోటు క్యాడర్‌లో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

స్థానికంగా ఉన్నా..

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ తన సొంత నియోజకవర్గం వికారాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు. ఎన్నికలు ముగిసి ఏడాదిన్నర కావస్తున్నా ప్రజాక్షేత్రంలో మాత్రం కనిపించడంలేదు. అడపాదడపా ప్రెస్‌నోట్లు ఇచ్చి మిన్నకుండి పోతున్నారు. ప్రజా, కార్యకర్తల సమస్యలపై స్పందించిన దాఖలాలు లేవు. దీంతో కేడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. కవిత అరెస్టు సమయంలోగానీ.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయం గురించి బీఆర్‌ఎస్ అధినేత.. మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించిన సమయంలో గానీ జిల్లా నేతలు పెద్దగా స్పందించలేదు. లగచర్ల ఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసినా కనీసం నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టలేదని పార్టీ సీనియర్ నేతలే అంటున్నారు.

చుట్టపుచూపుగా కొప్పుల..

మరో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఎన్నికల్లో ఓటమిపాలయ్యింది మొదలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వారంలో కనీసం నాలుగు నుంచి ఐదు రోజులు నియోజకవర్గంలోనే మకాం వేశారు. ప్రస్తుతం నియోజకవర్గానికి రావడంలేదు. అప్పుడప్పుడు చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారు.. పెళ్లిళ్లు, విందులు లాంటివి ఉన్నప్పుడే కనిపిస్తున్నారు. ఇప్పటి వరకు పార్టీ కార్యక్రమాల్లో గానీ.. ప్రజా సమస్యలపై గానీ స్పందించిన దాఖలాలు లేవు.

కేడర్‌కు అండగా..

జిల్లాలోని మిగతా వారితో పోలిస్తే కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నియోజకవర్గానికి కొంత సమయం కేటాస్తున్నారు. మకాం హైదరాబాద్‌లోనే ఉన్నా.. వారం పదిరోజులకు ఒక్కసారి కొడంగల్‌కు వచ్చి వెళ్తున్నారు. లగచర్ల ఘటనలో జైలుకు వెళ్లి వచ్చాక ఆయన స్వరం తగ్గినా కేడర్‌కు అండగా ఉంటున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలు.. కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నారు. అయితే పట్నం కూడా స్థానికంగా ఉండటంలేదనే విమర్శలు ఉన్నాయి. ఒకవేళ పార్టీ జిల్లా సారథిని మార్చాల్సి వస్తే నరేందర్‌రెడ్డికి పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశం ఉందనే చర్చ ఇటీవల కాలంలో జోరుగా ప్రచారమవుతోంది.



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

వికటించిన 'పాఠం'

- బయాలజీ టీచర్‌పై వేటు
- ఆవు మెదడుతో ప్రయోగాత్మక బోధన
- ఉపాధ్యాయురాలి తీరుపై హిందూ సంఘాలు, బీజేపీ ఆందోళన
- ఘటనపై విచారణ జరిపిన ఎంఈఓ, సీఐ
- టీచర్‌ను సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు
- హెచ్‌ఎం ఫిర్యాదుతో పీఎస్‌లో కేసు నమోదు

యాలాల: పదో తరగతి విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య చెప్పాలనుకున్న బయాలజీ టీచర్ ఆలోచన వికటించింది. జంతువుల్లో మెదడు పనితీరు, నియంత్రణ విషయాలను వివరించేందుకు ఆవు మెదడును స్కూల్‌కు తీసుకెళ్లడం తీవ్ర దుమారం రేపింది. ఈ విషయమై హిందూ సంఘాలు, బీజేపీ నాయకుల ఆందోళనలతో ఘటనపై విచారణ జరిపిన విద్యాశాఖ అధికారులు సదరు టీచర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఖాసీమాబీ బయాలజీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వరిస్తున్నారు. ఇదిలా ఉండగా మెదడు పనితీరు, నియంత్రణ అంశంపై గత మంగళవారం టెన్త్ విద్యార్థులకు పాఠం బోధించారు. ఈ సమయంలో ఓ జంతువు మెదడును ప్రదర్శిస్తూ విద్యార్థులకు లెస్సన్ చెప్పారు. ఇది ఏ జంతువు మెదడు మేడమ్..? అని విద్యార్థులు అడగగా.. ఆవు మెదడు అని చెప్పారు. సాయంత్రం ఇంటికి వెళ్లిన విద్యార్థులు ఆవు మెదడును తెచ్చి తమ మేడమ్ పాఠం చెప్పారని తల్లిదండ్రులకు వివరించారు. ఈ విషయం స్థానిక యువకులు, హిందూ సంఘాల నాయకులకు తెలియడంతో బుధవారం గ్రామంలో నిరసన ర్యాలీ చేపట్టారు. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే గోమాత మెదడును ప్రదర్శించిన టీచర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సమాచారం అందుకున్న రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ గిరి, ఎంఈఓ రమేశ్ స్కూల్‌కు చేరుకుని, వివరాలు సేకరించారు. పాఠ్యాంశం విన్న విద్యార్థులతో పాటు తోటి ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించి, జిల్లా విద్యాధికారికి నివేదిక అందజేశారు. ఘటనకు కారణమైన టీచర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ, ఎంఈఓ పేర్కొనడంతో ఆందోళనకారులు శాంతించారు. అధికారుల రిపోర్ట్ అందుకున్న డీఈఓ రేణుకాదేవి టీచర్ ఖాసీమా బీని సస్పెండ్ చేస్తూ సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. మరో వైపు ఇదే ఘటనకు సంబంధించి పాఠశాల హెచ్‌ఎం మల్లమ్మ ఫిర్యాదు మేరకు పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరి తెలిపారు.



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న వారికి నచ్చజెబుతున్న సీఐ నగేష్



విద్యార్థినితో పాఠం చదివిస్తున్న డీఈఓ రేణుకాదేవి

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి
- డీఈఓ రేణుకాదేవి

బంట్వారం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ రేణుకాదేవి అన్నారు. బుధవారం కోట్‌పల్లి మండలం ఎన్నారం జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల నమోదు సంఖ్యను మరింతగా పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం బోధనా తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలను అడిగి తెలుసుకున్నారు. ఏఐ బోధన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు సబ్జెక్టులకు సబంధించి సూచనలు చేశారు. సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదవడం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చదువుతో పాటు క్రమ శిక్షణ కూడా చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతిరోజూ దినపత్రికలు చదివి జనరల్ నాలెడ్జ్ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శారద, పీఎస్ హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయులు హర్షబేగం, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదుతరాలు రాజ్యాంగ అపహాస్యం

మెదక్ ఎంపీ రఘునందన్ రావు

కుల్కచర్ల: యాభై ఏళ్ల పాలనలో ఐదు తరాలుగా రాజ్యాంగాన్ని అపహాస్యం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బుధవారం కుల్కచర్లలో సంవిధాన్ హత్యా దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము గొప్ప వ్యక్తులుగా భజనలు చేయించుకుంటున్న కాంగ్రెస్ అగ్ర నేతలు తరతరాలుగా రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూనే ఉన్నారని అన్నారు. భారతదేశ మొట్టమొదటి ప్రధానిగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ కేరళలో ప్రజా ప్రభుత్వాన్ని ఆర్టికల్ 356 ప్రకారం రద్దు చేయడం జరిగిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ 1975లో అలహాబాద్ హైకోర్టు ఆమె ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తన పదవి పోతుందని గ్రహించి ఎమర్జెన్సీ విధించడం జరిగిందన్నారు. కోర్టులు, పత్రికల గొంతు నొక్కి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడించిందని విమర్శించారు.త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ నాయకులను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, రాష్ట్ర నాయకులు సాంబమూర్తి, ఘణపురం వెంకటయ్య, మాధవరెడ్డి, ఉప్పరి రమేష్, పరమేశ్వర్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, దిశ కమిటీ జిల్లా సభ్యులు జానకిరాం చౌహాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మైపాల్, బంధయ్య, మండల అధ్యక్షుడు వెంకటయ్య, కుల్కచర్ల, చౌడాపూర్, దోమ మండలాల అధ్యక్షులు వెంకటయ్య, శ్రీనివాసులు, మల్లేశం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్ రావు

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

- లబ్ధిదారుల్లో చైతన్యం తేవాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎంపీడీఓలు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటి వరకు ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్నింటికి మార్కింగ్ ఇచ్చారు, ఎప్పటిలోగా పూర్తి చేస్తారు అనే విషయాలపై ఆరా తీశారు. మండలాల వారీగా ఇళ్ల నిర్మాణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు విడతల్లో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓలు పీహెచ్‌సీలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీయాలన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేలా చొరవ చూపాలన్నారు. పాఠశాలల్లో మరమ్మతు పనులను పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, లక్ష్యం మేర మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం ఉపాధి హామీ పథకం పనులపై ఆరా తీశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, అన్ని మండలాల ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

దరఖాస్తులను పరిశీలించాలి

భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను అన్ని మాడ్యూల్స్‌లో పరిశీలించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తహసీల్దార్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి డేటా ఎంట్రీ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో మార్పే లక్ష్యం

విద్యాశాఖ చైర్మన్ ఆకునూరి మురళి

మంచాల: అభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం ఉంటేనే ఏ కార్యక్రమైనా విజయవంతం అవుతుందని రాష్ట్ర విద్యాశాఖ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మండల పరిధిలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్‌స్కూ ల్‌లో కొనసాగుతున్న పనులు, పాఠశాల నిర్వహణ తీరును పరిశీలించేందుకు బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వంగూరు, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు 150 మంది విచ్చేశారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని వివరించారు. ఇందులో భాగంగా ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మార్చామన్నారు. పేరెంట్స్ కమిటీ సహకారంతో 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 2 వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారని చెప్పారు. పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మంచాల ఎంఈఓ రాందాస్, ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌గౌడ్, సుప్రియ, ఉపాధ్యాయులు కిషన్ చౌహాన్, మోహన్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.డీ.జానీపాషు, నూకం రాజు, భాస్కర్ పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమలాకర్‌రెడ్డి

- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి

కుల్కచర్ల: వెనుకబడిన తరగతుల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని అల్లాపూర్ గ్రామ పంచాయతీలో ప్రజలకు పీఎం జన్‌మన్, జాతీయ గౌరవ్ ఉత్సవ్ అభియాన్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన తరగతుల వారి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రస్తుతం గ్రామంలోని ప్రతి కుటుంబానికి బ్యాంక్ ఖాతా ఇప్పించడం, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం ఇప్పించడం జరుగుతుందన్నారు. ఇళ్లు లేని వారి వివరాలను సేకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముజాహిద్‌పూర్ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ ఆఫీసర్ గోవింద్, పంచాయతీ కార్యదర్శి మైమూనాబేగం తదితరులు పాల్గొన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి నషా ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాలాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని పేర్కొన్నారు. కొన్ని క్షణాల ఆనందం కోసం ఎంతో విలువైన జీవితాన్ని కోల్పోరాదని సూచించారు. కార్యక్రమంలో కుల్కచర్ల వసతి గృహ ప్రత్యేకాధికారి సుందర్, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ రాజేందర్ రాథోడ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారిని చిదిమేసిన లారీ

- స్కూటీని ఢీకొట్టడంతో మూడేళ్ల బాలిక మృతి
- భార్యాభర్తలకు తీవ్రగాయాలు, పరిస్థితి విషమం
- దుద్యాల్ గేట్ సమీపంలో ఘటన


మృతి చెందిన కూతురు అక్షితతో తల్లిదండ్రులు అనిత, వెంకటేశ్ (ఫైల్)


ప్రమాదానికి కారణం అయిన లారీ

దుద్యాల్: అతివేగంగా ప్రయాణిస్తున్న ఓ లారీ అదుపుతప్పి, స్కూటీని లారీ ఢీ కొట్టడంతో ఓ చిన్నారి అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నారాయణపేట్ జిల్లా కోస్గి పట్టణానికి చెందిన అనిత, వెంకటేశ్ దంపతులకు మూడేళ్ల బాలిక అక్షిత ఉంది. వెంకటేశ్ కోస్గిలో కారు నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. బుధవారం ఉదయం బ్యాంకు లోన్ నిమిత్తం ముగ్గురూ స్కూటీపై కొడంగల్‌కు బయల్దేరారు. ఈక్రమంలో తాండూరు నుంచి సిమెంట్‌లోడ్‌తో మహబూబ్‌నగర్ వెళ్తున్న లారీ (ఏపీ 03 యూ 9362) దుద్యాల్ గేట్ సమీపంలో.. ముందు వెళ్తున్న ఎర్టిగా కారును ఢీకొట్టింది. ఆవెంటనే డ్రైవర్ లారీని కుడివైపునకు తిప్పడంతో ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొంది. ఈప్రమాదంలో అక్షిత లారీ చక్రాల కింద నలిగి అక్కడికక్కడే చనిపోయింది. అనిత, వెంకటేశ్‌కు కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దుద్యాల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కోస్గి ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. అక్షిత శరీరభాగాలను సంచిలో వేసి పోస్టుమార్టానికి పంపించారు. ప్రస్తుతం అనిత పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించామని ఎస్‌ఐ యాదగిరి తెలిపారు. ఎర్టిగాకు పెద్దగా నష్టం జరగకపోవడంతో కారులో ప్రయాణిస్తున్న వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. లారీ టైర్ల కింద పడి నుజ్జునుజ్జయిన అక్షిత మాంసం ముద్దలను సేకరించేందుకు అంబులెన్స్ సిబ్బంది వెనకడుకు వేస్తుండగా చిన్నారి బంధువైన ఓ వ్యక్తి సాయంతో ఎస్‌ఐ స్వయంగా శరీర భాగాలను సేకరించారు. స్కూటీని ఢీకొట్టిన లారీ ఆతర్వాత రైస్‌మిల్ ప్రహరీకి సంబంధించిన పిల్లర్‌ను ఢీకొని ఆగిపోయింది. డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న దళిత నాయకులు

యాలాల: మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన దళిత రైతు రవికుమార్‌పై దాడిచేసి గాయపరిచిన వారిని వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్, దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం దళిత ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ..హాజీపూర్‌కు చెందిన రవికుమార్ గోరేపల్లి గ్రామానికి చెందిన కోటం శ్రీనివాస్‌కు చెందిన పొలాన్ని ఏడేళ్లుగా కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఈ నెల 17న పొలంలో విత్తనాలు వేసేందుకు వెళ్లగా, అదే గ్రామానికి చెందిన కోటం విష్ణు, ఫకీరప్ప తమ అనుచరులతో వచ్చి రవిపై కర్రలతో దాడి చేసి చంపేందుకు యత్నించారన్నారు. ఈ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి నిందితులను అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మహిపాల్, శ్రీనివాస్, బుస్సా శ్రీనివాస్, వ్య.కా.స. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలక్కయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థికి కాంస్యపతకం


కాంస్య పతకంతో విద్యార్థి సాయికిరణ్

కొడంగల్ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న అల్వాల్ సాయికిరణ్‌కు షాట్‌పుట్ విభాగంలో కాంస్య పతకం వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన 23వ జాతీయ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ విభాగంలో విద్యార్థి సాయికిరణ్ కాంస్య పతకం సాధించడం హర్షణీయమన్నారు. తమ కళాశాల విద్యార్థి జాతీయ స్థాయిలో పతకం సాధించడం గర్వకారణమన్నారు. క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం, శారీరక దృఢత్వం, సామాజిక గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు.

బావిలో పడి వృద్ధుడు మృతి


ఈదయ్య (ఫైల్)

పరిగి: పొలానికి వెళ్లిన వృద్ధుడు బావిలో పడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయ ఈదయ్య(70)కు కొంత కాలం క్రితం కుమారుడు చనిపోవడంతో కోడలు, మనవళ్ల దగ్గర ఉంటున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం పొలం దగ్గర స్నానం చేసివస్తానని చెప్పి వెళ్లాడు. దీంతో మనవళ్లు బైక్‌పై ఎక్కించుకుని పొలం దగ్గర దించి వచ్చారు. మళ్లీ టిఫిన్ తీసుకుని వెళ్లి అక్కడ పెట్టి వచ్చారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో పొలం దగ్గర చూడగా ఈదయ్య కనిపించ లేదు. దీంతో అక్కడ చుట్టు పక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించ లేదు. బావి దగ్గరకు వెళ్లి చూడగా గట్టుపైన చెప్పులు కనిపించాయి. ఈ విషయాన్ని గ్రామస్తులకు సమాచారం అందించడంతో వారొచ్చి బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. బుధవారం మృతుడి కోడలు వెంకటమ్మ మామ మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా శరణు బసప్ప నియామకం

జులై 6న ప్రమాణ స్వీకారం


శరణు బసప్ప

తాండూరు టౌన్: తాండూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఆర్ శరణు బసప్పను నియమించారు. ఆయనతో పాటు క్లబ్ కార్యదర్శిగా మంకాల్ నటరాజ్, కోశాధికారిగా గౌరీ శంకర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా నూతన కమిటీ పనిచేస్తుందన్నారు. వచ్చే నెల 6వ తేదీన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన లయన్స్ క్లబ్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీల హక్కులపై చర్చించండి


ఆర్ కృష్ణయ్యను కలిసిన బీసీసేన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీల హక్కుల సాధన కోసం, బీసీసేన గ్రామ కమిటీలు, కార్యాచరణపై చర్చించారు. బీసీలకు రావాల్సిన 42 శాతం రిజర్వేషన్‌పై ప్రభుత్వంతో చర్చించాలని ఆర్.కృష్ణయ్యను నాయకులు కోరారు. గ్రామీణ స్థాయి నుంచి బీసీసేన కమిటీలను పటిష్టంగా వేసుకోవాలని, కులాలకతీతంగా భాగస్వాములను చేయాలని కృష్ణయ్య సూచించారు. బీసీలను అన్ని రంగాల్లో చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు.

ఇచ్చిన హామీల అమలులో విఫలం

డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆరోపించారు. బుధవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారనే విషయాన్ని క్షేత్రస్థాయిలో వెళ్లి అడిగితే అసలు విషయం తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇన్నాళ్లు రైతులను మోసం చేసి ఇప్పుడు రైతునేస్తం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాడు రైతు వేదికలు ఎందుకన్నా నాయకులు నేడు అవే వేదికల్లో కార్యక్రమాలు జరుపుకుంటున్నారన్నారు. అధికారంలోకి వస్తే ఎకరాకు రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇపుడు రూ.12వేలు ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైన రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గోపాల్, మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, నాయకులు సుభాన్‌రెడ్డి, మంచన్‌పల్లి సురేశ్, దేవదాసు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ సరఫరాకు ఒప్పందం

ఆర్‌బీఓఎల్ పరిశ్రమ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి


శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు: పెట్రో ధరల నియంత్రణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమలను ప్రోత్సహిస్తోందని ఆర్‌బీఓఎల్ పరిశ్రమ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం యాలాల మండలం జెక్కెపల్లి గ్రామ శివారులోని పరిశ్రమలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏడాది కాలంలో మూడు కోట్ల లీటర్ల ఇథనాల్ సరఫరా చేయాలని పెట్రోలియం సంస్థలైన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్‌లు ఆర్‌బీఓఎల్ పరిశ్రమతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సరఫరా కొనసాగుతోందన్నారు. పరిశ్రమ నుంచి వచ్చే ఆదాయంలో గ్రీన్ బడ్జెట్ సీఎస్‌ఆర్ నిధులను రెండు నెలలుగా రక్షణ శాఖకు అందిస్తున్నామని వివరించారు.

బైక్ అదుపుతప్పి ఏఈకి గాయాలు


గాయపడ్డ రఘువీర్

యాలాల: బైక్ అదుపు తప్పి కింద పడటంతో మండల ట్రాన్స్‌కో ఏఈకి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. నారాయణపేట జిల్లాకు చెందిన రఘువీర్ యాలాల మండల ట్రాన్స్‌కో ఏఈగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం స్వస్థలానికి వెళ్లి బుధవారం జిల్లా కేంద్రంలో సమావేశానికి హాజరయ్యేందుకు బైక్‌పై వస్తున్నాడు. కోస్గి సమీపంలోని చంద్రవంచ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఆయనను మహబూబ్ నగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ట్రాన్స్‌కో సిబ్బంది తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కేశంపేట: పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగిరాకపోవడం, చుట్టుముట్టిన ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు, తెలిపిన వివరాల ప్రకారం... లేమామిడి శివా రు తుర్కలపల్లికి చెందిన దిద్దెల ప్రశాంత్ (30) కూలీ పనులు చేస్తూ భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలతో కలిసి జీవించేవాడు. కొంతకాలంగా ఆర్థిక సమస్యలు నెలకొడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం కృష్ణవేణి పిల్లలను తీసు కుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 23న ఆమెను తీసుకువచ్చేందుకు వెళ్లగా తిరస్కరించడంతో మరుసటి రోజు తిరిగి వచ్చేశాడు. మంగళవారం రాత్రి తన ఇంట్లోని రేకుల పైపు నకు ఉరేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు తలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యు లు నిర్ధారించారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్ప త్రిలో పోస్టు మార్టం ని ర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగించి లైంగిక దాడి

గచ్చిబౌలి: వైన్ షాపు ముందు పరిచయమైన ఓ యువకుడు అతిగా మద్యం తాగించి యువతిపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం.. ఈవెంట్లలో డ్యాన్సర్‌గా పని చేసే ఓ యువతి(23) గచ్చిబౌలి జంక్షన్‌లోని వైన్ షాపు వద్ద మద్యం తాగుతోంది. కుక్‌గా పనిచేసే ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రకాష్ మద్యం తాగుతున్న యువతిని పరిచయం చేసుకొని..దగ్గర్లోనే తన రూమ్ ఉందని నమ్మించి తీసుకెళ్లాడు. ఇద్దరు మద్యం తాగి నిద్రపోయారు. రాత్రి 2 గంటలకు యువతికి మెళకువ రావడంతో.. ఒంటిపై బట్టలు లేకపోవడంతో లైంగిక దాడి జరిగిందని ఫిర్యాదు చేసింది.

సమన్వయం చేసుకుంటూ పనులు చేయాలి


మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్లు

అనంతగిరి: జిల్లాలోని విద్యుత్ అధికారులు రైతులను సమన్వయం చేసుకుని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థ చీఫ్ ఇంజనీర్లు సాయిబాబా, పెరుమాళ్ల ఆనంద్, బాలస్వామి అన్నారు. వికారాబాద్‌లోని విద్యుత్ కార్యాలయంలో టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ ఫరూకి ఆదేశాల మేరకు బుధవారం సంస్థ చీఫ్ ఇంజనీర్లు జిల్లా విద్యుత్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటివరకు 2,058 విద్యుత్ కనెక్షన్లు విడుదల చేశామన్నారు. ఇందులో 277 నియంత్రికలు, 116 కేఎం కండక్టర్, 78 కేఎం కేబుల్ సంబంధిత విద్యుత్ స్తంభాలు, మ్యాచింగ్ మెటీరియల్ రైతులకు అందజేశామన్నారు. వచ్చే జులైలో మరో 2వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్‌ఈ రవిప్రసాద్, డీఈలు, ఎస్‌ఏఓలు, ఏడీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

భూదాన భూములను కాపాడాలి


సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న జంగయ్య

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

షాబాద్: అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ, భూదాన భూములను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో సీపీఐ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు అసైన్డ్ భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాలన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, ఆనాటి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ స్ఫూర్తితో ఈ దేశంలో విప్లవ ఉద్యమాలు జరిగాయన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ కార్యకర్తలు ప్రజలు ఆందోళన నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు సత్తిరెడ్డి, మక్బూల్, మంజుల, అంజయ్య, రఘురాం, మధు, నారాయణ, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం సీపీఐ షాబాద్ మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జంగయ్య ప్రకటించారు. మండల కార్యదర్శిగా నాగర్‌కుంట గ్రామానికి చెందిన పాలమాలకు శ్రీశైలంను ఎనుకున్నారు. సహాయ కార్యదర్శులుగా గడ్డం వెంకటేష్, రాములు, వీరితో పాటు 15 మంది కౌన్సిల్ సభ్యులను కమిటీలోకి తీసుకున్నారు.

పట్టుబడిన నల్లబెల్లం ధ్వంసం


బెల్లాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆమనగల్లు: వివిధ కేసుల్లో పట్టుబడిన నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, ఇతర ముడి పదార్థాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ ఆధ్వర్యంలో బుధవారం ధ్వంసం చేశారు. పట్టణ సమీపంలో పెద్ద గోతిని తీసి మున్సిపాలిటీ సిబ్బంది సహాయంతో వివిధ కేసులలో పట్టుబడిన 780 కిలోల నల్లబెల్లం, 80 కిలోల పటిక, 40 కిలోల విప్ప పువ్వును నాశనం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు కృష్ణప్రసాద్, అరుణ్‌కుమార్, సిబ్బంది శంకర్, దశరథ్, బాబు, లోక్య, శ్రీను, ఉపేందర్, శ్రీజ, ఆమని తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్‌లో పుస్తకాలు సీజ్

- బీజేపీ నాయకుల ఆందోళనతో స్పందించిన విద్యాశాఖ అధికారులు


పుస్తకాలు నిల్వ చేసిన గదికి సీజ్ చేయిస్తున్న ఎంఈఓ వెంకటయ్య గౌడ్

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం పుస్తకాల విక్రయ దందా కొనసాగిస్తున్న విషయం తెలుసుకున్న బీసీ జేఏసీ నాయకులు బుధవారం స్కూల్ ఎదుట ఆందోళనకు దిగారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని చోట పుస్తకాలు విక్రయిస్తున్న విషయంపై మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ అక్కడికి చేరుకుని సుమారు రూ. 4లక్షల విలువైన పుస్తకాలను సీజ్ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించొద్దని గతంలోనే సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఐనప్పటికీ సదరు స్కూల్ యాజమాన్యం ఓ గదిలో పుస్తకాలు, బ్యాగులు తదితర స్టేషనరీ సామాగ్రిను విక్రయిస్తోందన్నారు. ఈ మేరకు పుస్తకాలు నిల్వ చేసిన గదిని సీజ్ చేసి, ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం సదరు పాఠశాలపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ పేర్కొన్నారు.

కారు ఢీకొని ఇద్దరు మహిళలు మృతి

- ప్రాణాపాయ స్థితిలో మరో మహిళ
- స్కూటీని కారు ఢీకొట్టడంతో ప్రమాదం
- మొయినాబాద్ మండలం రెడ్డిపల్లి సమీపంలో ఘటన


అశ్విని


సుశీల

మొయినాబాద్: కారు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఇద్దరు మహిళలను బలిగొంది. మరో మహిళ మృత్యువుతో పోరాడుతోంది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఖైరతాబాద్‌కు చెందిన నందకిషోర్, అశ్విని(37) దంపతుల పిల్లలు మొయినాబాద్‌లోని సుజాత స్కూల్‌లో చదువుతున్నారు. దీంతో వీరి కుటుంబం కొంతకాలంగా హిమాయత్‌నగర్‌లో అద్దెకు ఉంటున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు అశ్విని తన మరదలు లక్ష్మి స్కూటీపై రెడ్డిపల్లిలోని మీసేవ కేంద్రానికి బయలుదేరారు. చిలుకూరుకు వెళ్లగానే మేడిపల్లికి చెందిన కుమ్మరి సుశీల(60) యాకో బ్యాంకుకు వచ్చి తిరిగి వెళ్లేందుకు వీరిని లిఫ్ట్ అడిగింది. ముగ్గురూ స్కూటీపై వెళ్తుండగా రెడ్డిపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన కారు అతివేగంతో ఢీకొట్టింది. దీంతో ముగ్గురూ ఎగిరి రోడ్డుపై పడ్డారు. తీవ్ర గాయాలపాలైన వీరిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అశ్విని, సుశీల మృతిచెందారు. లక్ష్మి పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అర కిలోమీటర్ దూరంలోనే...

స్కూటీపై వెళ్తున్న మహిళలు మరో రెండు నిమిషాల్లో గమ్య స్థానానికి చేరుకునేవారు. అరకిలోమీటర్ దూరంలో దూరంలో ప్రమాదానికి గురికావడంతో ఇద్దరి ప్రాణాలు గాల్లో కలిశాయి. కారు అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు గుర్తించారు. ఘటన జరిగిన చోట ఓ షాపులో ఉన్న సీసీ కెమరాల్లో ప్రమాదం జరిగిన తీరు నిక్షిప్తమైంది. కారు అతివేగంతో వచ్చి స్కూటీని ఢీకొట్టినట్లు సీసీ టీవీలో రికార్డయ్యింది.

అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్టు

బంగారం చోరీ చేసి యూపీకి పరారీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: మహిళల మెడలో బంగారు పుస్తెల తాళ్లనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు తెగబడుతున్న ఓ దుండగుడిని పోలీసులు అరెస్టు చేసి కటకటాల పాలు చేశారు. బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ విజయ్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామానికి చెందిన నల్లపురం బల్వంత్‌రెడ్డి, అనసూయ దంపతులు ఈ నెల 11న ద్విచక్ర వాహనంపై రామేశ్వరం దైవ దర్శనానికి వెళుతున్నారు. హాజిపల్లి శివారు దాటుతుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వెనక నుంచి వచ్చి అనసూయ మెడలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకొని పారిపోయారు. ఈ ఘటనపై దంపతులు అదే రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారీగా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. పోలీసులు లక్నోలో ప్రధాన నిందితుడు మహేంద్రరాస్తోగిని అరెస్టు చేయగా, మరో నిందితుడు చాంద్‌బాబు పరారీలో ఉన్నాడు. తమదైన శైలిలో విచారించగా ప్రధాన నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి నుంచి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. అతడిపై కర్నూల్, విజయనగరం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, అల్వాల్, బాచుపల్లితో పాటుగా ఉత్తర్‌ప్రదేశ్‌లో బైక్, చైన్‌స్నాచింగ్, మర్డర్, గంజాయికి సంబంధించి 20కిపైగా కేసులు ఉన్నాయి. చాకచాక్యంగా కేసును ఛేదించిన క్రైమ్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

'స్థానిక' ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

ఆరు గ్యారెంటీల అమలు ఉత్తిదే

- అక్రమ కేసులతో భయపెడుతున్నారు
- ఎస్‌ఐ రవూఫ్‌ను రెండు రోజుల్లో సస్పెండ్ చేయాలి
- లేదంటే ఆందోళన
- విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక ఏడాదిన్నర కావస్తుందని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో హాజరైన అనంతరం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లా ఎస్పీ స్పందించాలి

రెవెన్యూ అధికారులను, పోలీసులను అదుపులో పెట్టుకొని సొంత పాలన కొనసాగిస్తున్నారని ఫైర్ అయ్యారు. పోలీసులు అక్రమ కేసులతో భయపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లా ఎస్పీ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఐని రెండు రోజుల్లో సస్పెండ్ చేయాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోట్ల యాదగిరి, నాయకులు మహేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చాంద్‌పాషా, మధుయాదవ్, శ్యామలయ్యగౌడ్, గోవిందరెడ్డి, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ వర్ధంతికి రావాలి

సాయిచంద్ మౌర్య రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 29న ఆయన స్వగ్రామంలో నిర్వహిస్తున్నామని ఎరన్‌పల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి గోడపత్రికను విడుదల చేశారు. వర్ధంతి సభకు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. ఇందులో మాసాని వెంకటయ్య, నెహ్రూనాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.